క్లుప్తంగా

ఆకట్టుకున్న ఆధ్యాత్మిక ప్రవచనం



ఆధ్యాత్మిక ప్రసంగం చేస్తున్న గుదిమెళ్ల రంగాచారి

విజయనగరం టౌన్: స్థానిక రింగ్ రోడ్డు వద్ద ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో శనివారం రాత్రి నిర్వహించిన ఆధ్యాత్మిక ప్రవచన కార్యక్రమం భక్తులను ఆకట్టుకుంది. డాక్టర్ గుదిమెళ్ల రంగాచారి రామాయణంలోని పలు అంశాలను భక్తులకు వివరించారు. మహాసామ్రాజ్య పట్టాభిషేకంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ అధ్యక్ష, కార్యదర్శులు పిల్ల విజయకుమార్, చెరుకూరి శ్రీధర్‌తో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రామతీర్థానికి పోటెత్తిన భక్తులు

నెల్లిమర్ల రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి దేవస్థానానికి శనివారం భక్తులు పోటెత్తారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు స్వామికి ప్రాతఃకాలార్చన, బాలభోగం నిర్వహించారు. అనంతరం యాగశాలలో సుందరాకాండ హవనం, ఆదిత్య హృదయం, గాయత్రీ రామాయణం, సుదర్శన అష్టకం తదితర పూజా కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం స్వామికి వెండి మండపం వద్ద కల్యాణ మహోత్సవం నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఆకతాయిలపై చర్యలు తీసుకోవాలి

పూసపాటిరేగ: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ముఖద్వారం వద్ద ఆకతాయిల ఆగడాలు రోజురోజుకు పెరుగుతున్నాయని, వాటికి అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు. గత కొంత కాలంగా పాఠశాల వద్ద విద్యార్థులపై ర్యాగింగ్‌కు పాల్పడుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. నిత్యం అదేపనిగా ఆకతాయిలు వేధింపులకు పాల్పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు నిఘావేసి ఆకతాయిలపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

చలివేంద్రం ప్రారంభం



రాకోడులో ఏర్పాటు చేసిన చలివేంద్రం

విజయనగరం రూరల్: మండలంలోని రాకోడు గ్రామంలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో శనివారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. వేసవి తీవ్రత దృష్ట్యా రైతులు, ఉపాధిహామీ కూలీలు, వృద్ధులు, విద్యార్థులు తాగునీటికి ఇబ్బందులు పడకుండా పంచాయతీ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశామని కార్యదర్శి పి.భాగ్యరాజ్ తెలిపారు. తాగునీటి సౌకర్యాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

బొండపల్లి: ఎన్నికల కోడ్‌ను ప్రతి ఒక్కరూ పాటించాలని, నిబంధనలు అతిక్రమించే వారిపై చర్యలు తప్పవని ఎస్‌ఐ కె.లక్ష్మణరావు అన్నారు. మండలంలోని వేంద్రాం గ్రామస్తులకు ఎన్నికల నిబంధనలపై శనివారం సాయంత్రం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అనవసర తగాదాల్లో తలదూర్చి కేసుల్లో ఇరుక్కోవద్దని సూచించారు. పోలీస్ సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించండి

మెరకముడిదాం: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో ముగిసేలా ప్రజలంతా సహకరించాలని బుధరాయవలస ఎస్‌ఐ బి.లోకేశ్వరరావు కోరారు. మండలంలోని కొత్తకర్ర గ్రామంలో ప్రజలకు ఎన్నికల నిబంధనలపై శుక్రవారం రాత్రి అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు, ఎవరైనా గొడవలు, కొట్లాటలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గొడవలకు దిగిన వారిపై బైండోవర్ కేసులతో పాటు, అవసరమైతే రౌడీషీట్ కూడా తెరుస్తామని చెప్పారు. పోలీస్ సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం

మెరకముడిదాం: మండలంలోని బుధరాయవలస గ్రామంలో గర్భాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శనివారం వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యాధికారులు అనీల్‌రామ్ కుమార్‌రెడ్డి, కె.భారతి, ఎం.వి.వి.సత్యనారాయణ 240 మందికి సాధారణ, నేత్ర వైద్యపరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామికి విశేష పూజలు

జామి: మండలంలోని భీమసింగిసుగర్ ఫ్యాక్టరీ వద్ద ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రధాన అర్చకులు వరప్రసాద్ ఆచార్యుల ఆధ్వర్యంలో శనివారం విశేష పూజలు చేశారు. స్వామివారిని వివిధ పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

ఇంటింటా సంక్షేమం | జగనన్నతోనే సాధ్యం

- ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి
- 48వ డివిజన్ గాజులరేగలో ఎన్నికల ప్రచారం



కోలగట్లకు విజయ తిలకం దిద్దుతున్న మహిళ



ప్రచారం చేస్తున్న కోలగట్ల

విజయనగరం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్హతే ప్రామాణికంగా ప్రతీ ఇంటికీ సంక్షేమ పథకాలు అందాయని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సంక్షేమ పాలన అందించారని ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. ప్రజలకు మేలు చేసిన ఈ ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్పొరేషన్ పరిధిలోని 48వ డివిజన్ గాజులరేగ ప్రాంతంలో శనివారం ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి ఈ ఐదేళ్లలో అందించిన సంక్షేమం, చేసిన అభివృద్ధిని వివరించారు. సంక్షేమం, అభివృద్ధే అజెండాగా ప్రజల ముందుకు వచ్చామని, మరోసారి అవకాశం ఇస్తే సమస్యలు లేని నగరంగా విజయనగరాన్ని తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. ప్రతిపక్షాలు చేస్తున్న అసత్య ప్రచారాలు, తప్పుడు హామీలను నమ్మి మోసపోవద్దని ప్రజలకు సూచించారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను, విజయనగరం ఎంపీగా బెల్లాన చంద్రశేఖర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న కోలగట్లకు స్థానికులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో మేయర్ వి.విజయలక్ష్మి, స్థానిక కార్పొరేటర్ నడిపిల్లి ఆదినారాయణ, 50వ డివిజన్ కార్పొరేటర్ పట్టా ఆదిలక్ష్మి, పీఏసీఎస్ అధ్యక్షుడు జమ్ము మధు, పార్టీ నగర ప్రధాన కార్యదర్శి జామాన శ్రీనివాసరావు, నాయకులు కనుగుల రాజా, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

గెలిపించండి మరింత అభివృద్ధి చేస్తాం..

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల, ఎంపీ బెల్లాన



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: నిరంతరం ప్రజాసేవ చేస్తున్న తమలాంటి వ్యక్తులను గెలిపించినట్లయితే రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, పార్లమెంట్ సభ్యుడు బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. నగరంలోని ఓ హోటల్‌లో శనివారం వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కోలగట్ల వీరభద్రస్వామి మాట్లాడుతూ.. కార్పొరేషన్ హోదా దక్కించుకున్న విజయనగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామన్నారు. 3 లక్షలకు పైగా జనాభా కలిగిన నగరంలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా 11వాటర్ ట్యాంకులు ఏర్పాటు చేయడంతో పాటు మారుమూల ప్రాంతాల్లో సైతం సీసీరోడ్లు, డ్రైనేజీలు నిర్మించామన్నారు. పార్కులను అభివృద్ధి చేయటంతో పాటు ప్రధాన జంక్షన్లను సుందరంగా తీర్చిదిద్దామని చెప్పారు. విజ్ఞత గల న్యాయవాదులు మరోసారి తమను గెలిపించి నగరాభివృద్ధికి దోహదపడాలని కోరారు. ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ ఆత్మీయ సమావేశానికి న్యాయవాదులు సంఘీభావం తెలపడం ఆనందంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి న్యాయవాదుల అభ్యున్నతికి కట్టుబడి ఉన్నారన్నారు. సీనియర్ న్యాయవాదులు కోలగట్ల తమన్నశెట్టి మాట్లాడుతూ.. ఏ ముఖ్యమంత్రి చేయని సహాయ సహకారాలు న్యాయవాదులకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేశారన్నారు. న్యాయవాదులకు వెల్ఫేర్ ఫండ్ కింద రూ.100 కోట్లు మంజూరు చేసిన ఘనత ఆయనదేనన్నారు. ఇన్సూరెన్స్‌లో అధిక శాతం ప్రభుత్వమే భరించే విధంగా కృషి చేశారన్నారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది బొడ్డు సత్యనారాయణ, లీగల్ సెల్ అధ్యక్షుడు అంజనీ కుమార్, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు హరీష్, ముద్దాడ రమణి, రాంబాబు, స్వరూప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బీజేపీ ఆవిర్భావ వేడుకలు



పార్టీ జెండాను ఎగురవేస్తున్న నాయకులు

విజయనగరం టౌన్: భారతీయ జనతాపార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. పార్టీ పార్లమెంట్ కన్వీనర్ శంబర లక్ష్మీనరసింహం, జాతీయ కౌన్సిల్ సభ్యుడు బవిరెడ్డి ప్రసాద్‌రెడ్డి పార్టీ జెండాను ఎగురవేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. 1951లో భారతీయ జనసంఘ్‌గా ఏర్పడి 1980లో బీజేపీగా మారిందని, నేడు దేశంలోనే అతిపెద్ద పార్టీగా గుర్తింపు పొందిందన్నారు. పార్టీని ప్రారంభించిన డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ, పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ సేవలను కొనియాడారు. అనంతరం మిఠాయిలను పంచిపెట్టారు. కార్యక్రమంలో విజయనగరం అసెంబ్లీ కన్వీనర్ ఇమ్మంది సుధీర్, నెల్లిమర్ల అసెంబ్లీ కన్వీనర్ బూర్లె శ్రీధర్, మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాణంగపల్లి అశోక్, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షులు గండికోట శాంతి, మండల అధ్యక్షులు ఇప్పిలి గోపాలకృష్ణ, కంది సీతారాం, గొండుబోయిన కూర్మారావు, మజ్జి రమేష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రికార్డుల నిర్వహణ పక్కాగా ఉండాలి



సచివాలయ ఉద్యోగులకు సూచనలు చేస్తున్న ఎంపీడీఓ హరిహరరావు

బొండపల్లి: సచివాలయాల్లో రికార్డులను పక్కాగా నిర్వహించాలని ఎంపీడీఓ ఎస్.హరిహరరావు సచివాలయ ఉద్యోగులకు సూచించారు. మండలంలోని గరుడుబిల్లి గ్రామ సచివాలయాన్ని శనివారం ఆయన సందర్శించారు. రికార్డులను పరిశీలించిన అనంతరం సిబ్బందికి పలు సూచనలు చేశారు. గ్రామాల్లో ఇంకా ఎవరైనా పింఛన్ తీసుకోని వారు ఉంటే గుర్తించి, వారందరికీ పింఛన్ అందజేయాలని చెప్పారు. ఉపాధి పనులను పంచాయతీ కార్యదర్శులు పరిశీలించాలని సూచించారు. ఆయన వెంట మండల పరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్ దత్తి వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శి కె.ఎర్రినాయుడు తదితరులు ఉన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి



కొండవెలగాడలో ఫ్లాగ్‌మార్చ్ చేస్తున్న పోలీసులు

- సీఐ వెంకటేశ్వరరావు

నెల్లిమర్ల రూరల్: ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు ప్రజలంతా సహకరించాలని సీఐ వెంకటేశ్వరరావు కోరారు. మండలంలోని కొండవెలగాడ గ్రామంలో శనివారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. కేంద్ర బలగాలతో కలిసి గ్రామంలో పర్యటించి ఎన్నికల ప్రక్రియ, ఓటు హక్కు ఆవశ్యకతపై ప్రజలకు అవగాహన కల్పించారు. భోగాపురం సబ్ డివిజన్ పరిధిలో గుర్తించిన సమస్యాత్మక గ్రామాల్లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తూ ప్రజలను అప్రమత్తం చేస్తున్నట్లు చెప్పారు. ఎన్నికల్లో ఎటువంటి గొడవలు సృష్టించరాదని, గొడవలకు పాల్పడేవారిపై కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. ముఖ్యంగా చదువుకున్న యువత అప్రమత్తంగా ఉండాలన్నారు. కేసులు నమోదైతే భవిష్యత్‌పై తీవ్ర ప్రభావం చూపిస్తుందన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

కోర్టు తరలింపునకు ఉత్తర్వులు జారీ



జిల్లా న్యాయమూర్తి నుంచి ఉత్తర్వుల ప్రతిని అందుకుంటున్న ఎస్.కోట బార్ అసోసియేషన్ సభ్యులు

శృంగవరపుకోట: స్థానిక మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు భవనాలు శిథిలావస్థకు చేరుకోవడంతో కోర్టును వేరే భవనాల్లోకి తరలించేందుకు ఎట్టకేలకు హైకోర్టు నుంచి అనుమతులు వచ్చాయి. ఇటీవల ఎన్నికైన ఎస్.కోట బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు జి.సూరిదేముడు, బి.సత్యనారాయణ, కార్యవర్గ సభ్యులు అంతా జిల్లా ప్రధాన న్యాయమూర్తి కల్యాణచక్రవర్తిని శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. వీరికి న్యాయమూర్తి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మీరు కోరిన విధంగా ఎస్.కోట కోర్టును తాత్కాలికంగా అద్దె ప్రాతిపదికన సాయికృష్ణ కల్యాణ మండపంలోకి మార్చేందుకు హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసిందని చెప్పారు. అందుకు సంబంధించిన ఉత్తర్వుల ప్రతిని ఎస్.కోట బార్ అధ్యక్షుడు సూరిదేముడుకు అందజేశారు. జిల్లా న్యాయమూర్తిని కలిసిన వారిలో బార్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు ఎల్.అప్పారావు, బి.త్రిమూర్తులు, డబ్ల్యూ.ఎస్.శర్మ, అల్లు సత్యాజీ, న్యాయవాదులు ఎస్.టి.వి.దాసు, జి.ప్రకాశ్, టి.వి.ఆర్.మూర్తి, బి.రామకృష్ణ, బి.వి.ఎస్.రామారావు, ఎన్. సత్యనారాయణ, ముత్యాలనాయుడు తదితరులు ఉన్నారు.

సచివాలయ ఉద్యోగుల సాయం

తెర్లాం: ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన సుందరాడ గ్రామ సచివాలయం డిజిటల్ అసిస్టెంట్ ఉప్పాడ శ్రీకాంత్ కుటుంబానికి పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు అండగా నిలిచారు. పంచాయతీ కార్యదర్శులు, మండలంలోని అన్ని సచివాలయాల ఉద్యోగులు కలిసి రూ.లక్షా 15వేలు సేకరించి ఆ మొత్తాన్ని ఎంపీడీఓ బి.మధుసూదనరావు చేతులమీదుగా శనివారం ఉద్దవోలులోని ఆయన కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడండి

బాడంగి: వేసవిలో గ్రామీణ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని మండల ప్రత్యేకాధికారి సూర్యచంద్రరావు అధికారులకు సూచించారు. మండల పరిషత్ కార్యాయంలో శనివారం ఆయన మాట్లాడుతూ.. పాడైన తాగునీటి బోర్లు, రక్షితనీటి పథకాలు, మోటార్లను గుర్తించి వెంటనే బాగుచేయించాలన్నారు. వడదెబ్బకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని, ఎండ తీవ్రత పెరగకముందే రైతులు, వ్యవసాయ కూలీలు, ఉపాధి వేతనదారులు ఇళ్లకు చేరుకునేలా చూడాలని అధికారులకు సూచించారు. ఉపాధిహామీ పనుల వద్ద టెంట్లు, తాగునీరు, ప్రథమ చికిత్స కిట్లు ఏర్పాటు చేయాలన్నారు. ఎంపీడీఓ ఆంజనేయులు, ఈఓపీఆర్డీ సూర్యనారాయణ పాల్గొన్నారు.

వడదెబ్బపై అప్రమత్తం

మెంటాడ: ప్రస్తుతం ఎండలు పెరుగుతున్నందున వడదెబ్బకు గురికాకుండా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ కల్పన సూచించారు. గుర్లతమ్మిరాజుపేటలో శనివారం నిర్వహించిన శిబిరంలో వేసవిలో వడదెబ్బకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు బయటకు వెళ్లొద్దని సూచించారు. అత్యవసర సమయంలో బయటకు వెళ్లాల్సి వస్తే టోపీ లేదా రుమాలు ధరించి వెళ్లాలన్నారు. శరీరం డీహైడ్రేషన్‌కు గురికాకుండా నీటిని అధికంగా తీసుకోవాలని, నిమ్మరసం, కొబ్బరి నీళ్లు తాగాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ ఉష, ఏఎన్‌ఎం పార్వతి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

మూకుమ్మడిగా వలంటీర్ల రాజీనామా



విజయనగరం రూరల్: రాజీనామా పత్రాలను పంచాయతీ కార్యదర్శికి అందజేస్తున్న వలంటీర్లు



పూసపాటిరేగ: రాజీనామా చేసిన కుమిలి, రెల్లివలస వలంటీర్లు



పూసపాటిరేగ: ఉద్యోగానికి రాజీనామా చేసిన భోగాపురం మండలం సవరవిల్లి సచివాలయ వలంటీర్లు

విజయనగరం అర్బన్: గ్రామ/వార్డు సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు సేవలందిస్తున్న వలంటీర్లు స్వచ్ఛందంగా తమ ఉద్యోగాలకు రాజీనామా చేస్తున్నారు. ప్రతిపక్షాలు తమపై లేనిపోని ఆరోపణలు చేయడంతో పాటు పింఛన్ల పంపిణీ నుంచి తప్పించడానికి నిరసనగా జిల్లా వ్యాప్తంగా వలంటీర్లు రాజీనామాలు చేస్తున్నారు. శనివారం ఒక్కరోజే జిల్లా వ్యాప్తంగా 95 మంది రాజీనామా చేశారు. దీంతో ఇంతవరకు రాజీనామాలు చేసిన వారి సంఖ్య 129కి చేరింది. ప్రతిపక్షాల ఫిర్యాదుతో వలంటీర్లు ఎన్నికల ప్రచారంలో పాల్గొనరాదని ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేసింది. దీంతో వారంతా స్వచ్ఛందంగా రాజీనామాలు చేసి వైఎస్సార్‌సీపీ నాయకుల తరఫున ప్రచారంలో పాల్గొనేందుకు సిద్ధమయ్యారు. వలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చి తమకు ఉద్యోగాలు కల్పించిన వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుంటామని చెప్తున్నారు.

- **విజయనగరం రూరల్:** మండలంలోని రీమాపేట పంచాయతీలో సేవలందిస్తున్న 9 మంది వలంటీర్లు తమ ఉద్యోగాలకు రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను పంచాయతీ కార్యదర్శి పి.భాగ్యరాజ్‌కు శనివారం అందజేశారు.

కుమిలి-1,2, రెల్లివలస పరిధిలో 76 మంది రాజీనామా

పూసపాటిరేగ: మండలంలోని కుమిలి-1, కుమిలి-2, రెల్లివలస సచివాలయాల పరిధిలో సేవలందిస్తున్న 76 మంది వలంటీర్లు శనివారం రాజీనామా చేశారు. కుమిలి-1 పరిధిలో 25 మంది, కుమిలి-2లో 16 మంది, రెల్లివలసకు చెందిన 35 మంది వలంటీర్లు తమ రాజీనామా పత్రాలను ఎంపీడీఓ ఎం.రాధికకు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య అనుసంధాన కర్తలుగా నిశ్వార్థంగా సేవలందిస్తున్న తమపై టీడీపీ, జనసేన నాయకులు చేస్తున్న ఆరోపణలతో మనస్తాపం చెంది రాజీనామా చేసినట్లు చెప్పారు. రానున్న రోజుల్లో జగనన్న సైనికులుగా పనిచేసి ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడుని భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని, జగనన్నను మరోసారి సీఎంను చేసుకుంటామన్నారు. ఇంటింటికీ వెళ్లి జగనన్న అందించిన సంక్షేమాన్ని ప్రజలకు వివరించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ మహంతి శ్రీనివాసరావు, కుమిలి వైస్ సర్పంచ్ గుజ్జు సురేస్‌రెడ్డి, పడాల శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

- భోగాపురం మండలం సవరవిల్లి గ్రామ సచివాలయం పరిధిలో సేవలందిస్తున్న 18 మంది వలంటీర్లు శనివారం రాజీనామా చేశారు.

పార్టీ విజయంలో కీలకపాత్ర పోషించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ అప్పలనాయుడు

విజయనగరం రూరల్: వైఎస్సార్‌సీపీ విజయంలో పార్టీ యువజన విభాగం కార్యకర్తలు కీలకపాత్ర పోషించాలని ఎంపీపీ మామిడి అప్పలనాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు నడిపేన శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని చెల్లూరు గ్రామ సచివాలయం పరిధి బడ్డుకొండపేట గ్రామంలో యుజవన విభాగం కార్యకర్తలతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఐదేళ్లుగా ప్రజా సంక్షేమం కోసం అహర్నిశలు కృషిచేసిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. ఆయన్ను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఐదేళ్లలో చేసిన మంచిని, అభివృద్ధిని ఇంటింటికీ వెళ్లి వివరించాలని సూచించారు. ప్రతిపక్షాల ఆరోపణలను తిప్పికొట్టాలని, వారి బూటకపు హామీలను నమ్మొద్దని ప్రజలకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రాజు, బడ్డుకొండపేట సర్పంచ్ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు



వాహన చోదకులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ లక్ష్మణరావు

బొండపల్లి: మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని ఎస్‌ఐ కె.లక్ష్మణరావు సూచించారు. స్థానిక జాతీయ రహదారి-26పై పోలీస్ సిబ్బందితో కలిసి శనివారం ఆయన వాహన తనిఖీలు నిర్వహించడంతో పాటు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదాలకు చాలా వరకు మైనర్లే కారణమన్నారు. మైనర్లు ద్విచక్ర వాహనాలను ఇష్టారీతిగా నడపడం వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తే సంబంధిత వాహన యజమానులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ద్విచక్రవాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు.